ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 14.07.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్‌లోని మ్యారియట్ హోటల్‌లో ఈరోజు బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమ్మిట్–2026ను కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రారంభించారు.

2. సింగరేణి ప్రయోజనాల దృష్ట్యా, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి తాడిచర్ల-2 కోల్ బ్లాక్‌ను ఎలాంటి వేలం లేకుండా సింగరేణికి కేటాయించామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి.. సింగరేణి భరోసా యాత్రలో తెలిపారు.

3. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్రమంత్రులతో ఢిల్లీలో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.

4. రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు అక్కడక్కడా చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

----------------------------------

**మాండవీయ**

హైదరాబాద్‌లోని మ్యారియట్ హోటల్‌లో ఈరోజు బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమ్మిట్–2026ను కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ అంతర్జాతీయ సదస్సులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు.. బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**డెస్క్**

--------------------------------

**సింగరేణి భరోసా యాత్ర**

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 'సింగరేణి భరోసా యాత్ర' రెండో రోజు కొనసాగుతోంది. నిన్న కొత్తగూడెం, మణుగూరులో పర్యటించిన కేంద్రమంత్రి బృందం.. ఈరోజు భూపాలపల్లి, గోదావరిఖని, మంచిర్యాల ప్రాంతాల్లో పర్యటిస్తోంది. ఈ ఉదయమే భూపాలపల్లిలో యాత్ర మొదలయ్యింది. ముందుగా కేటీకే -8 గనికి వెళ్లిన కేంద్రమంత్రి కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. కార్మికుల కుటుంబాల్లో సంతోషం నింపడానికే తాము వచ్చామని స్పష్టం చేశారు. సింగరేణి ప్రయోజనాల దృష్ట్యా, ప్రధాని మోదీని ఒప్పించి తాడిచర్ల-2 కోల్ బ్లాక్‌ను ఎలాంటి వేలం లేకుండా కేటాయించామని వివరించారు. అనంతరం తాడిచర్ల-2 గనిని కేంద్రమంత్రి రెడ్డి పరిశీలించారు. అక్కడ సింగరేణి కార్మికులను ఉద్దేశించి కిషన్ రెడ్డి మాట్లాడుతూ...

**బైట్ - కిషన్ రెడ్డి, కేంద్రమంత్రి**

అనంతరం సింగరేణి భరోసా యాత్ర కొద్దిసేపటి క్రితం రామగుండం ప్రాంతానికి చేరుకుంది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సహా పలువురు నాయకులు ఉన్నారు.

**డెస్క్**

--------------------------------

**రేవంత్ - ఢిల్లీ**

దేశ జనాభాలో 2.5 శాతం ఉన్న తెలంగాణ, జీడీపీలో మాత్రం 5 శాతం వాటా కలిగి ఉందని... రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విమానాశ్రయాలు ఎంతో అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమై మామునూరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల డిజైన్ల ఖరారు, వసతుల కల్పనపై చర్చించారు. ఈ రెండు విమానాశ్రయాల పనులను 2028, జూన్ 2 నాటికి పూర్తి చేసి ప్రారంభించడమే లక్ష్యంగా

పెట్టుకున్నామని ఆయన వెల్లడించారు. అనంతరం కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన ముఖ్యమంత్రి.. రీజినల్ రింగ్ రోడ్ నార్త్ పార్ట్ పనులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపాలని, అలాగే సౌత్ పార్ట్‌కు కూడా త్వరగా అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్రాల మధ్య సహకార స్ఫూర్తి కొనసాగుతుందని పేర్కొన్న ముఖ్యమంత్రి, త్వరలోనే కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తోనూ సమావేశం కానున్నారు.

**డెస్క్**

--------------------------------

**వాకిటి**

ప్రతిష్ఠాత్మక '8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026' ఆతిథ్య హక్కులను తెలంగాణకు కేటాయించడంపై రాష్ట్ర ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్ విచ్చేసిన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, కార్మిక శాఖ మంత్రి వివేక్, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో, రాష్ట్రాన్ని క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నవంబర్‌లో జరిగే ఈ మెగా టోర్నీలో దేశవ్యాప్తంగా సుమారు 8 వేల మంది అథ్లెట్లు పాల్గొననున్నారు.

**డెస్క్**

-----------------------------------

**భట్టి**

సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2 వేల 200 మంది అధికారుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. కోల్ ఇండియా తరహాలో అధికారుల వేతన సవరణ, పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ అమలు చేయాలన్న అధికారుల విజ్ఞప్తులను ప్రాధాన్యతగా

పరిశీలించాలన్నారు. సింగరేణి సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి, ఇతర ఉన్నతాధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. అధికారుల అసంతృప్తిని నివారించేలా రెండు మూడు నెలల్లో సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

**డెస్క్**

----------------------------------------

**వివేక్**

తాడి చర్ల 2 బొగ్గు గనితో స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయని రాష్ట్ర కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచి ర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం లో మంత్రి మాట్లాడుతూ...

**బైట్ - మంత్రి వివేక్ వెంకటస్వామి...**

**పీటీసీ - మంచిర్యాల**

----------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు అక్కడక్కడా చెదురుముదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది. వర్షాలతో పాటు బలమైన గాలులు వీస్తాయని హెచ్చరించింది.

**పీఎస్**

---------------------------------

**తుమ్మల**

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికను సిద్ధం చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ ఇక్రిశాట్‌లో వివిధ పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో వర్షపాతం లోటు

ఉన్నందున, జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు, విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. వివిధ శాఖల సమన్వయంతో ప్రతి వారం మండలాల వారీగా 'సమగ్ర వ్యవసాయ-వాతావరణ బులెటిన్' విడుదల చేసి, రైతు వేదికల ద్వారా రైతులకు చేరవేయాలని సూచించారు.

**డెస్క్**

--------------------------------

**శిక్షణ**

ఆలయాల సంప్రదాయాలు, ఆగమశాస్త్ర విధి విధానాల ప్రకారమే దేవాలయాల నిర్వహణ, పూజా విధానాలు నిర్వహించడం జరుగుతుందని స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు తెలిపారు. వేములవాడలో రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...

**బైట్ – రాఘవాచార్యులు**

**పీటీసీ - సిరిసిల్ల**

------------------------------------

**వేవ్స్**

వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (WAVES) 2027 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ సీజన్ 2' కింద పరిశ్రమల నేతృత్వంలోని ఛాలెంజ్‌ల కోసం సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలను ఆహ్వానించింది. మీడియా, వినోద రంగంలోని సృష్టికర్తలను గుర్తించడం, ప్రోత్సహించడం, వారి నైపుణ్యాలను మెరుగుపరచడం, వారి ప్రతిభను ప్రదర్శించడం దీని లక్ష్యం. పారదర్శకమైన, ప్రతిభ ఆధారిత విధానం ద్వారా, ప్రతిపాదనల

సమర్పణ, ఛాలెంజ్‌ల ఎంపిక, వాటిని అమలు చేసే సంస్థల కోసం ఒక ఏకీకృత పోర్టల్‌ను రూపొందించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

**డెస్క్**

---------------------------------------

**ఎస్సీ చైర్మన్**

రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజా భవన్‌లో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ కిషోర్ మక్వానాతో జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో ఇరవై ఐదు ఎకరాల్లో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుండి వీటిని అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. అలాగే, నర్సరీ నుండి పన్నెండో తరగతి వరకు ఉచిత రవాణా, భోజన వసతులతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తూనే, జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు రాజకీయ, ఇతర రంగాల్లో పెద్దపీట వేస్తున్నామని సిఎం స్పష్టం చేశారు.

**డెస్క్**

--------------------------------------

**కేటీఆర్**

కాళేశ్వరం మేడిగడ్డ బ్యారేజ్ వద్ద రోజుకు తొమ్మిది టీఎంసీల నీరు వృధాగా పోతున్నా, ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయకుండా రైతులను నష్టపరుస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు. కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్ నీటి పరిస్థితిని పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో కనీసం 20 శాతం నీరు కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

**పీటీసీ - కరీంనగర్**

----------------------------------

**కలెక్టర్**

ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున, తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులలో నీటి కొరత రాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మండల స్థాయి అధికారులు ప్రతి రెండు వారాలకు ఒకసారి ఈ కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు.

**పీటీసీ – నల్గొండ**

-------------------------------

**పీఎం శ్రీ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎంపిక చేసిన 11 పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ తెలిపారు. ఈ శిక్షణ కోసం అర్హులైన కరాటే, కుంగ్ఫూ, జూడో, కళరియపట్టు నిపుణులు దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఈ నెల 16వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడా శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆయన సూచించారు.

**పీటీసీ - సిరిసిల్ల**

----------------------------

**యూనిఫాంలు**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను గడువులోపు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. యూనిఫాంల కుట్టింపు ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా

పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. యూనిఫాంల కుట్టుపని, నాణ్యతా ప్రమాణాలు, పంపిణీ బాధ్యతలను ఈ కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుందని కలెక్టర్ తెలిపారు.

**పీటీసీ - వరంగల్**

--------------------------

**శుక్లా**

భారతదేశం 2040 నాటికి సొంత అంతరిక్ష కేంద్రాన్ని స్థాపించడంతో పాటు, చంద్రునిపైకి భారతీయ వ్యోమగామిని పంపనుందని ప్రముఖ వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా వెల్లడించారు. హైదరాబాద్ ఐఐటీలో నిర్వహించిన 'ఎక్స్‌ట్రా మ్యూరల్ లెక్చర్స్' కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతిష్ఠాత్మక 'ఆక్సియమ్-4' మిషన్‌లో సభ్యుడైన శుక్లా.. భారత వైమానిక దళ కాక్‌పిట్ నుండి అంతరిక్ష యానం వరకు తన స్ఫూర్తిదాయక అనుభవాలను పంచుకున్నారు. దేశ అంతరిక్ష ఆకాంక్షలను సాకారం చేసేందుకు కొత్త తరం ఇంజనీర్లు, శాస్త్రవేత్తల అవసరం ఎంతో ఉందన్నారు.

**పీటీసీ - సంగారెడ్డి**

------------------------------

**బోనాలు**

బోనాల పండుగ సందర్భంగా ఆలయాల వద్ద ఏర్పాట్లు చెయ్యాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించి అనేక అంశాలపై దిశా నిర్దేశం చేశారు. నగర పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు.

**పీటీసీ - వరంగల్**

----------------------------------